సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం ‌। 11 । నవంబర్ । 2024



సైబర్ నేరగాళ్ల పంజా

సైబర్ నేరగాళ్లు గోదావరి జిల్లాలపై పంజా విసురుతున్నారు. ప్రముఖులు, బడా వ్యక్తుల లక్ష్యంగా డబ్బులు దండుకుంటున్నారు. 8లో



రూప్‌చంద్‌కు రికార్డు ధర

రూప్‌చంద్ చేపల ధర రికార్డులు సృష్టిస్తుంది. ఎన్నడూ లేనివిధంగా కిలో రూ.125 నుంచి రూ.127 వరకూ పలుకుతుంది. 8లో



మన్యంలో పెరుగుతున్న చలి

జిల్లాలోని మన్యం ప్రాంతంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుంది. కొద్దిరోజులుగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

ఉద్యోగ భద్రత కల్పించాలి



భీమవరంలో ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

భీమవరం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వైద్యారోగ్య శాఖలో విలీనం చేయాలని 104 ఉద్యోగులు ధర్నా చేశారు. ఆదివారం భీమవరం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో చేపట్టిన ధర్నాను ఉద్దేశించి బి.గోపిమూర్తి మాట్లాడుతూ పోరాటాలు, ఉద్యమాల ద్వారానే హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ పాలకులు కాంట్రాక్టర్లకు ప్రయోజనం కలిగేలా 104 వ్యవస్థ నడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.విజయకుమార్, ఎస్.సురేష్ మాట్లాడుతూ 104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం దారుణమన్నారు. వాహనాల మరమ్మతులకు సొమ్ములు చెల్లించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎం.ఆంజనేయులు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్, ఉపాధ్యక్షుడు సుందర్‌సింగ్, సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రశ్నించలేని కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న భారాలను రాష్ట్రంలోని కూటమి సర్కారు కళ్లప్పగించి చూస్తోంది తప్ప ప్రశ్నించడం లేదని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారామ్ విమర్శించారు. భీమవరంలో ఆదివారం జరిగిన పట్టణ మహాసభలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కనీసం స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలపై విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాలు వేస్తున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. అనంతరం కార్యదర్శిగా డి.వాసుదేవరావు, 9 మందితో నూతన పట్టణ కమిటీ ఏర్పడింది. బొక్కా సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరంలో కొనసాగిన ఐటీ సోదాలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో ఐటీ శాఖ అధికారుల సోదాలు ఐదో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. పలువురు రియల్ ఎస్టేట్, రొయ్యల వ్యాపారుల ఇళ్లలో, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో సోదాలు లేనప్పటికీ ఐటీ అధికారుల సెక్యూరిటీ సిబ్బంది పహారా కాస్తున్నారు. సాయంత్రం వరకూ వారు అక్కడే ఉన్నారు. రియల్ ఎస్టేట్, రొయ్యల వ్యాపారులే లక్ష్యంగా మూడు రోజుల నుంచి విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి. అయితే సోదాల వివరాలు అధికారులు వెల్లడించలేదు, ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు.

అంతర్ వర్సిటీ జూడో పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

పెంటపాడు :పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నన్నయ్య వర్సిటీ అంతర్ కళాశాలల జూడో పోటీలు ప్రారంభమయ్యాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 14 మంది పురుషులు, మహిళలను ఎంపిక చేశారు. న్యాయ నిర్ణేతగా టీవీ రమణతేజ, అబ్జర్వర్‌గా రాంగోపాల్ వ్యవహరించారు. పీడీ బుజ్జిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరేశ్వరా పాహిమాం

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, లక్షపత్రి పూజ, భద్రకాళీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆంధ్ర రీజియన్ జైళ్ల శాఖ డీఐజీ ఎం.రవికిరణ్ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

అవకాశవాదంపై అవిశ్వాసం

నయవంచనకు గుణపాఠం

- నేడు జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం
- 44 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీలోనే..
- ఇప్పటికే స్టాండింగ్ కమిటీల బహిష్కరణ
- అనర్హత వేటు వేయాలంటూ నోటీసు ఇచ్చిన వైనం
- టీడీపీ తీర్థం పుచ్చుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- ఆమె చేరికను వ్యతిరేకిస్తున్న చింతమనేని వర్గం
- పద్మశ్రీకి సర్వత్రా అసమ్మతి సెగ



ఏలూరులో జిల్లా పరిషత్ కార్యాలయం (ఫైల్)



ఘంటా పద్మశ్రీ,
జెడ్పీ చైర్‌పర్సన్

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి చెక్ పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు దూకుడు పెంచగా.. టీడీపీ పంచన చేరినా అండ లేక ఆమె తీవ్ర నిరాశతో కొట్టుమిట్టాడుతున్నారు. ఆఖరికి టీడీపీ ఎమ్మెల్యేలు సైతం తామున్నామంటూ భరోసా ఇవ్వకపోగా పక్కలో బల్లెంలా మారడంతో తీవ్ర సంకట స్థితికి చేరుకున్నారు. కనీసం సహచర జెడ్పీటీసీలు సైతం కలిసి రాకపోవడంతో ఏకాకిగా మారారు. జనసేనలోకి జంప్ అంటూ ఉప్పందించి తీరా టీడీపీలోకి చేరడంతో ఆ పార్టీ నేతలు సైతం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అండ కోల్పోయిన తరుణంలో కొత్త పార్టీలోనైనా భరోసా దొరుకుతుందని ఆశించినా ప్రయోజనం శూన్యంగా కనిపిస్తోంది. ఈ తరుణంలో తన రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరంగా మారడంతో పదవి కాపాడుకోవడం ఆమెకు తక్షణ కర్తవ్యంగా మారింది. పదవి ఉంటుందా.. ఊడుతుందా అనేది తెలియని సందిగ్ధం ఒకవైపు, రాజకీయంగా ఎదగాలనే ఆకాంక్ష నెరవేరుతుందా లేదా అనేది మరోవైపు ప్రశ్నార్థకంగా మారాయి.

తారాస్థాయిలో అసమ్మతి

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి అసమ్మతి సెగ తారాస్థాయిలో తగిలింది. ఈనెల 8న జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు బహిష్కరించి తమ అజెండాను ప్రకటించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న ఆమెపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు జెడ్పీ సీఈఓకు నోటీసులు పంపారు. ఈ నేపథ్యంలో సోమవరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ సర్వసభ్య అత్యవసర సమావేశం ఏర్పాటు కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హత వేటు వేయించేందుకు గట్టిగా పట్టుబడుతున్నారు.

పార్టీ విప్‌ను ధిక్కరించి..

వాస్తవానికి జెడ్పీ చైర్‌పర్సన్‌గా కవురు శ్రీనివాస్ గతేడాది వరకు కొనసాగారు. ఎమ్మెల్సీగా కవురు శ్రీనివాస్‌ను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేయడంతో జెడ్పీ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ అయింది. బీసీ సామాజిక వర్గంలోని కొప్పుల వెలమకు చెందిన పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీని పార్టీ ఆ పదవికి ఎంపిక చేసింది. పద్మశ్రీ భర్త ఘంటా ప్రసాద్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా పార్టీలో ఉన్నారు. ఈ క్రమంలో పార్టీ విప్‌ను అనుసరించి 44 మంది జెడ్పీటీసీలు ఘంటా పద్మశ్రీని జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ఆమె పార్టీ విప్‌ను ధిక్కరించి పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. పంచాయతీరాజ్ చట్టం-1994 సెక్షన్ 181 (1) ప్రొవిజన్‌ను అనుసరించి ఆమెను డిస్ క్వాలిఫై చేయాలని, అలాగే సెక్షన్ 181 (7) ప్రకారం తిరిగి జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నిక జరిపించాలని నోటీసులు ఇచ్చారు.

టీడీపీలోనూ ఎదురీతే..

వైఎస్సార్‌సీపీ పదవులకు రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రకటించగా.. ఆ తర్వాత మూడు రోజులకే ఆమె భర్త ఘంటా ప్రసాద్ హడావుడిగా విశాఖ వెళ్లి మరీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన టీడీపీలో చేరారు. మళ్లీ కొద్ది రోజులకు చైర్‌పర్సన్ దంపతులు లోకేష్ సమక్షంలో పార్టీలో చేరి.. అనంతరం చంద్రబాబును కలిశారు. పెదపాడు జెడ్పీటీసీ కావడంతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో మొదటి నుంచి వీరికి విభేదాలున్నాయి. దీంతో చింతమనేని వర్గం సోషల్ మీడియా వేదికగా జెడ్పీ చైర్‌పర్సన్ చేరికపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. స్థానిక నాయకత్వంతో సంబంధం లేకుండా పార్టీలో చేర్చుకోవడం సరైన పద్ధతి కాదని, పార్టీలో చేరినంత మాత్రాన గతాన్ని ఏమీ మరిచిపోబోమని బహిరంగంగా చింతమనేని అనుచరులు హెచ్చరిస్తున్నారు. ఇక లోకేష్ సమక్షంలో చేరే సమయంలో కూడా మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా అధ్యక్షుడు మినహా ఒక్క ప్రజాప్రతినిధి కూడా కలిసిరాలేదు. ఘంటా పద్మశ్రీ టీడీపీలో చేరినా అధికారిక కార్యక్రమాలకే పరిమితమయ్యారే తప్ప పార్టీ కార్యక్రమాల్లో కనిపించకపోవడం గమనార్హం.

నమో నారసింహా

నేటి నుంచి శోభనాచలుని వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో శోభనగిరిపై కొలువైన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవం, కృత్తిక దీపోత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి సీహెచ్ సాయి, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు తెలిపారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 13న శ్రీవారి శోభనగిరి ప్రదక్షిణ, 14న కొండపై స్వామివారి వెలిసిన మూడు గుళ్ల వద్ద శాంతి కల్యాణం, సాయంత్రం దివ్య తిరు కల్యాణం, గరుడ వాహనోత్సవం, 15న అవబృదోత్సవం, చక్రస్నానం, సాయంత్రం ఆలయం కోవెల వద్ద కృత్తికా దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. వీటితోపాటు రోజూ స్వామి వారికి సుప్రభాత సేవ, ఆలయ నిత్య పూజ కార్యక్రమాలు, బ్రహ్మోత్సవ విశేష పూజలు, నిత్య హోమాలు, సాయంకాలార్చనలు, నీరాజన మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగాలను నిర్వహిస్తామన్నారు.

పురపాలక.. పట్టని ఏలిక

- పట్టణాల్లో ప్రగతి శూన్యం
- రోడ్లు, డ్రెయినేజీ పనులు లేవు
- పట్టించుకోని ఎమ్మెల్యేలు
- గత ప్రభుత్వంలో రూ.430 కోట్ల మేర పనులు



భీమవరంలో అధ్వానంగా ఉన్న శ్రీరామపురం-డీఎన్నార్ కళాశాల రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాల్లో అభివృద్ధి పనులు శూన్యంగా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలు కావస్తున్నా జిల్లాలోని మున్సిపాలిటీల్లో కనీసం ఒక్క రోడ్డు లేదా డ్రెయినేజీ నిర్మాణ పనులు కూడా జరగలేదు. నిధులు ఉన్నా అభివృద్ధి పనులకు మున్సిపాలిటీలు నోచుకోవడం లేదు. రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా మారడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులపై కూటమి ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. గత ఎన్నికల సమయంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తాం, తాగునీటి సమస్యలు లేకుండా చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత తమను విస్మరించారని ప్రజలు అంటున్నారు. అభివృద్ధి పనులకు ఇసుక కొరతను సాకుగా చూపుతున్నారు. పక్క జిల్లాల్లో ఇసుక అందుబాటులో ఉందని స్వయానా కలెక్టర్ చెబుతున్నా పట్టించుకోవడం లేదు. అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు సైతం స్పందించడం లేదు. వారు కూడా ఎమ్మెల్యేలు ఆదేశిస్తే గాని పనులు చేపట్టే పరిస్థితి లేదు.

గత ఐదేళ్లలో అభివృద్ధి పనులు

పట్టణం	వ్యయం (రూ.కోట్లలో)
భీమవరం	130
తాడేపల్లిగూడెం	70
నరసాపురం	50
పాలకొల్లు	60
తణుకు	70
ఆకివీడు	50

జగన్ హయాంలో తొలి మూడు నెలల్లో రూ.10 కోట్లతో పనులు

2019లో జగన్ సర్కారు కొలువు దీరిన మొదటి మూడు నెలల్లోనే జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో రూ.10 కోట్ల మేర అభివృద్ధి పనులు చేయించారు. వర్షాకాలంలోనూ పక్కా ప్రణాళికతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ఒక్కో పట్టణంలో రూ.కోటి నుంచి రూ.1.50 కోట్ల పనులు జరిగాయి. అంతకు ముందు ఉన్న టీడీపీ ప్రభుత్వం తీర్మానం చేసిన పనులను సైతం ప్రజాశ్రేయస్సు దృష్ట్యా పూర్తిచేయించారు. అలాగే గత ఐదేళ్లలో ఆరు పట్టణాల్లో రూ.430 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు భవనాల మరమ్మతులు, ఇతర పనులు చేయించారు.

భక్తులకు వన్‌వే కష్టాలు



ఘాట్ రోడ్డులో భారీగా నిలిచిన వాహనాలు




బారికేడ్లతో సెంట్రల్ పార్కింగ్ ప్రాంతం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఆదివారం భక్తులు ఇబ్బంది పడ్డారు. కొండ కిందకు వెళ్లే మార్గాన్ని మూసివేసి శివాలయం ఘాట్ రోడ్డు మీదుగా వెళ్లాలని అనడంతో అవస్థలు పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. క్షేత్రానికి వాహనాలపై వచ్చే భక్తులు ప్రధాన టోల్‌గేట్ మీదుగా కొండపైకి చేరుకుంటారు. వాహనాలను సెంట్రల్ పార్కింగ్‌లో నిలుపుతారు. మొక్కులు చెల్లించే వారిలో వృద్ధులు, దివ్యాంగులు ఉంటే సెంట్రల్ పార్కింగ్ వద్ద యూటర్న్ తీసుకుని, కిందకు వచ్చి టోల్‌గేట్ సమీపంలోని కేశఖండనశాల వద్ద దింపుతారు. అయితే అధికారుల ఆదేశాలతో కొండ కిందకు (కేశఖండనశాలకు) వచ్చే మార్గాన్ని సిబ్బంది పూర్తిగా మూసివేశారు. కొండపై నుంచి వాహనాలు శివాలయం (దొరసానిపాడు) ఘాట్‌రోడ్డు మీదుగానే వెళ్లాలని సూచించారు. అయితే హఠాత్తుగా తీసుకువచ్చిన వన్‌వే నిబంధనలు తెలియని పలువురు భక్తులు కొండపై నుంచి తిరిగి శివాలయం ఘాట్ రోడ్డు మీదుగా ఊరు మొత్తం చుట్టి మొక్కుల కోసం కేశఖండనశాల వద్దకు చేరుకున్నారు. రెండోసారి వెళ్లిన వాహనదారుల నుంచి టోల్ రుసుములను మళ్లీ వసూలు చేశారు. దీనిపై భక్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు వెనుకడుగు వేశారు. సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలకు గతంలో మాదిరిగా అనుమతిచ్చారు. ఇదిలా ఉండగా కొండపైన గేటు పెట్టి (కాలినడక భక్తులకు దారి వదిలి) మూసివేసిన పాత టోల్‌గేట్ మార్గాన్ని శని, ఆదివారాలు, పర్వదినాల్లో తెరిచి రాకపోకలకు అనుమతించాలని భక్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే

ఉంగుటూరు కూటమిలో బీటలు

- పరస్పరం జనసేన, టీడీపీ నేతల పోస్టులు
- పంపకాలు, అక్రమ వ్యవహారాల్లో తేడాలు
- జనసేన ఎమ్మెల్యే ఉన్నా టీడీపీ పెత్తనంపై కేడర్‌లో ఆగ్రహం
- ఎమ్మెల్యే ధర్మరాజుపై సోషల్ మీడియాలో టీడీపీ శ్రేణుల పోస్టులు
- లిక్కర్ నుంచి మట్టి వరకూ ఎమ్మెల్యే చేస్తున్నాడంటూ హడావుడి
- కౌంటర్ చర్యలు ప్రారంభించిన ఎమ్మెల్యే
- బెల్టుషాపులు, కోళ్ల వ్యర్థాల అక్రమ రవాణాపై 40కి పైగా కేసుల నమోదు
- ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని మధ్య ముదురుతున్న వివాదం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో కూటమికి బీటలు ఏర్పడ్డాయి. జనసేన, టీడీపీ నేతలు అక్రమ ఆదాయాల కోసం ఒకరిపై ఒకరు ఆధిపత్యానికి పోటీలు పడుతున్నారు. టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కనుసన్నల్లో సోషల్ మీడియా వేదికగా జనసేన ఎమ్మెల్యేపై ఆరోపణలు గుప్పిస్తుండగా, జనసేన ఎమ్మెల్యే కౌంటర్ చర్యలకు దిగడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరి రెండు పార్టీల నేతలు పరస్పర ఫిర్యాదులు చేసుకోవడం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

తెరచాటు రాజకీయం

ఉంగుటూరు నియోజకవర్గ అసెంబ్లీ సీటు గడచిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేనకు కేటాయించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేగా కొనసాగుతూ మళ్లీ టికెట్ ఆశించి పొత్తుల్లో త్యాగం చేసి భంగపడ్డారు. ఈ క్రమంలో ఎన్నికలకు ముందే గన్ని వీరాంజనేయులు, జనసేన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మధ్య అంతర్గతంగా ఆధిపత్య పోరు కొనసాగింది. ఎన్నికల సమయంలో అభ్యర్థి అన్నిరకాలుగా సర్దుబాటు చేసుకున్నారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నియోజకవర్గంలో ప్రధాన ఆదాయ వనరుగా కొల్లేరు చెరువులున్నాయి. ఇవి కాకుండా పోలవరం కాల్వ గ్రావెల్, లిక్కర్ షాపులు దానికి అనుబంధంగా ఉండే బెల్టుషాపులు, చేపల చెరువుకు మేతగా వాడే కోళ్ల వ్యర్థాల అక్రమ రవాణా, నియోజకవర్గంలో లేఅవుట్ల ద్వారా ఆదాయం ప్రధానంగా ఎమ్మెల్యేకి ఉంటుంది. సరిగ్గా ఈ ఆదాయ వ్యవహారాల మధ్యనే ఇద్దరు నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. బయటకు మాత్రం ఎక్కడ కలిసినా ఇద్దరూ చక్కగా మాట్లాడుకుంటూ కనిపించినా.. తెరచాటున ఇద్దరు నేతలు ద్వితీయ శ్రేణి నేతలతో రాజకీయం చేస్తూనే ఉన్నారు.

టీడీపీ యాక్షన్.. జనసేన ఎమ్మెల్యే రియాక్షన్

టీడీపీ నేతలు సోషల్ మీడియాలో ఎమ్మెల్యే ధర్మరాజు మద్యం షాపుల్లో 30 నుంచి 50 శాతం పెట్టుబడులు లేని వాటాలు, పోలవరం గ్రావెల్ దందా, చికెన్ వేస్ట్ లారీల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని, ప్రతి పనిలోనూ పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు చేస్తూ పోస్టులు పెట్టారు. దీనికి కౌంటర్‌గా ఎమ్మెల్యే ధర్మరాజు గత నెలలో ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి బెల్టుషాపులపై కేసులు నమోదు చేయాలని గట్టిగా ఆదేశించడంతో 12 రోజుల వ్యవధిలో 25 కేసులు నమోదు చేశారు. ఇవి ఎక్కువగా భీమడోలు మండలంలోనే ఉన్నాయి. కోళ్ల వ్యర్థాలకు సంబంధించి ఒక్క నిడమర్రు మండలంలోనే 15 కేసులు నమోదు చేయించారు. పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే అనుచరగణం చేస్తున్న వ్యవహారాలపై అధికారులతో హడావుడి చేయించడం హాట్ టాపిక్ అయింది. ఇద్దరు నేతలు పార్టీ అధినేతలకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నట్టు సమాచారం.

చెరువులు.. వైన్‌షాపులు

తన సీటును ఎమ్మెల్యేకు ఇచ్చి అనవసరంగా తప్పు చేశానని మాజీ ఎమ్మెల్యే టీడీపీ శ్రేణుల వద్ద బహిరంగంగానే మాట్లాడుతున్నారు. గతంలో గన్ని వీరాంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్న సమయం నుంచి భీమడోలు మండలంలో పెదలింగపాడు వద్ద 150 ఎకరాల చెరువు, కొల్లేరులంకల్లో 400 ఎకరాలు చెరువులు తన కనుసన్నల్లో కొనసాగిస్తున్నారు. వాటి లీజు వ్యవహారాలు కొద్దిరోజుల క్రితం ముగియడంతో మళ్లీ తమ వాళ్లకే ఇవ్వాలని టీడీపీ నేత డిమాండ్ పెట్టడం.. స్థానిక జనసేన నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మొదట వివాదం రేగింది. ఆ తరువాత నియోజకవర్గంలో 17 వైన్‌షాపులు సిండికేట్‌తో సంబంధం లేని అనేక మందికి, టీడీపీతో సంబంధం లేనివారికి కూడా దక్కాయి. ఈ క్రమంలో షాపుల్లో వాటాలు, సిండికేట్ వ్యవహారాల మధ్య ఇద్దరు నేతల ముఖ్య అనుచరులు వద్ద చర్చలు జరిగాయి. వాటాల వ్యవహారం మండలాల వారీగా పంచుకోవాలని ప్రయత్నాలు చేసినా సెట్ కాలేదు. ఈ క్రమంలో భీమడోలు మండలంలో మాజీ ఎమ్మెల్యేకు పట్టు ఉండటంతో మొత్తం బెల్టుషాపులు ఏర్పాటు చేయించి అటువైపు కన్నెత్తి చూడవద్దని అధికారులకు హుకుం జారీ చేశారు. ఇక గ్రావెల్, ఇతర అన్ని వ్యవహారాలు తామే చూసుకుంటామన్నట్టు టీడీపీ వ్యవహరిస్తోంది. దీనిపై ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వర్గాల మధ్య తర్జనభర్జనలు సాగిన క్రమంలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా వేదికగా జనసేన ఎమ్మెల్యేను టార్గెట్ చేసింది.

'పోలవరం' పూర్తికి కృషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

జంగారెడ్డిగూడెం: పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని కేంద్ర ఉక్కుభారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ సీనియర్ నాయకుడు మల్లాది సీతారామారావు ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ పోలవరం ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. విశాఖ ఉక్కుపై ఆంధ్రులకు ఉన్న సెంటిమెంట్‌ను ప్రధాని దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సత్తుపల్లి-భద్రాచలం రైల్వేలైన్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటుకు స్థానికులు ఇష్టపడటం లేదని, పరిశ్రమను బుట్టాయగూడెం మండ లం మర్లగూడెం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మంత్రికి విన్నవించగా సంబంధిత కేంద్ర మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

గోపిమూర్తికి వైఎస్సార్ టీఏ మద్దతు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బొర్రా గోపిమూర్తికి వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. యూటీఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కారానికి గోపిమూర్తి కృషిచేశారన్నారు.

క్లుప్తంగా

వాలీబాల్ జట్టుకు సచివాలయ ఉద్యోగి ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన శరత్ కుమార్

నూజివీడు: పట్టణానికి చెందిన బండారు శరత్‌కుమార్ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈయన ఆగిరిపల్లి మండలం కృష్ణవరం సచివాలయంలో గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఏపీ వాలీబాల్ జట్టుకు వరుసగా మూడోసారి ఎంపిక కావడం గమనార్హం.

చెప్పల బాక్స్‌లో తాచుపాము



నూకాలమ్మ గుడి సమీపంలోని ఇంట్లోని చెప్పల బాక్సులో ఉన్న తాచుపాము

జంగారెడ్డిగూడెం: చెప్పుల బాక్సులో గోధుమ తాచు కొద్దిసేపు కలకలం రేపింది. జంగారెడ్డిగూడెం పట్టణంలోని నూకాలమ్మ గుడి వెనుక జగదీష్ తన ఇంట్లో చెప్పులు వేసుకునేందుకు చెప్పుల బాక్సును తెరవబోగా, పాము ఉండటం గమనించి స్నేక్ సేవియర్స్ సొసైటీ సంస్థ అధ్యక్షులు చదలవాడ క్రాంతికి సమాచారం ఇచ్చారు. క్రాంతి చాకచక్యంగా పామును పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఎవరికి ఎలాంటి అపాయం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ జస్వంత్

ద్వారకాతిరుమల: పిచ్చి కుక్క దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ద్వారకాతిరుమలలోని తూర్పు వీధిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పల కిరణ్ ఇంటికి వెళ్లేసరికి అక్కడున్న ఒక పిచ్చికుక్క అమాంతం అతడిపై దాడి చేసింది. ఈ దాడిలో అతడి కాలుకి బలమైన గాయమైంది. అదే ప్రాంతానికి చెందిన 6 ఏళ్ల బాలుడు ఎస్. జస్వంత్ ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి రేబీస్ వ్యాక్సిన్ వేయించారు. పిచ్చికుక్కను చంపేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ అది దొరకలేదు.

అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్‌లోని ఓ గృహోపకరణాల దుకాణంలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.3 లక్షల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఏలూరు వన్‌టౌన్‌లోని బటర్ ఫ్లై హోమ్ నీడ్స్ షాప్‌లో ఆదివారం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని భావిస్తున్నామని ఆయన తెలిపారు.

సైబర్ నేరగాళ్ల పంజా

- ప్రముఖులే టార్గెట్‌గా బెదిరింపు ఫోన్లు
- భీమవరంలో ప్రముఖ వైద్యుడిని బురిడీ కొట్టించిన సైబర్ ముఠా
- రూ.72 లక్షలు వైద్యుడి ఖాతా నుంచి స్వాహా
- గోదావరి జిల్లాల్లో పెరుగుతున్న సైబర్ ముఠా ఆగడాలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: సైబర్ నేరగాళ్లు గోదావరి జిల్లాలపై పంజా విసురుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రముఖులు, బడా వ్యక్తులను టార్గెట్ చేసి మరీ డబ్బు దండుకోవడానికి కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. తాజాగా.. మీకొచ్చిన కొరియర్ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, కస్టమ్స్ అధికారులమంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. ఈ తరహా ఫోన్ కాల్స్ సగటున జిల్లాలో రోజూ 10కి పైగా వస్తుండటంతో కొందరు ప్రముఖులు కూడా నేరస్తులకు వలలో చిక్కి లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ప్రముఖ వైద్యుడిని ఇదే తరహాలో బెదిరించి గంటల వ్యవధిలో రూ.72 లక్షలు స్వాహా చేయడం గమనార్హం.

మనీ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు, రూపాయికి నాలుగు రెట్లు ఇస్తామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. కొద్ది నెలల క్రితం వరకు లాటరీ తగిలిందని, ట్యాక్స్‌లు రూ.30 లక్షలు చెల్లిస్తే రూ.కోటి మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని, ఖాతా వివరాలు తెలుసుకుని కాల్ పూర్తయ్యేలోపే స్వాహా చేసే ఘటనలు అనేకం నమోదయ్యాయి. ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల్లో భారీ మొత్తాలు రావాలంటే ట్యాక్స్‌లు చెల్లించాలంటూ పెద్ద ఎత్తున వసూలు చేసిన కేసులు కూడా జిల్లాలో అనేకం ఉన్నాయి. గతేడాది నర్సాపురానికి చెందిన యువకుడు ఆన్‌లైన్ గేమింగ్‌లో చాలెంజ్‌లు పూర్తి చేస్తే ప్రైజ్ మనీ రెట్టింపు అవుతుందని నమ్మి గేమ్‌లోని లేవెల్స్ అన్నీ పూర్తి చేసి రూ.27 లక్షలు చెల్లించాడు. కట్ చేస్తే... నగదు అకౌంట్‌లో కట్ అయ్యాక, సదరు యువకుడికి వచ్చిన ఫోన్లన్నీ మూగబోయాయి. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు నగరంలోనూ ఇదే తరహాలో ఒక యువతి చైన్ లింక్ యాప్‌లో అత్యధికంగా డబ్బులు వస్తాయని నమ్మి ఒక కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబితే బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు, పిన్ నంబరు సహా చెప్పడంతో రూ.11 లక్షలు నిమిషాల వ్యవధిలో మాయమయ్యాయి. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

డ్రగ్స్ పార్సిల్ అంటూ బెదిరింపులు

బడా డాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, మోసపోయినా బయటకు చెప్పుకోవడానికి పరువు నష్టంగా భావించే వ్యక్తులను ఈ ముఠా టార్గెట్ చేస్తోంది. ఇలాంటి క్రమంలో భీమవరానికి చెందిన సీనియర్ వైద్యుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. సదరు వైద్యుడు విదేశాల్లో చదివి అక్కడే పనిచేసి తరువాత భీమవరంలో ఉంటున్నారు. ఈ క్రమంలో బ్యాంకాక్ నుంచి మీ పేరుతో పార్సిల్ వచ్చిందని, పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్, బట్టలు, డ్రగ్స్ పార్సిల్‌లో ఉన్నాయని డాక్టర్‌కి ముంబై నుంచి ఫేక్ కాల్ వచ్చింది. తాము పార్సిల్ సర్వీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పారు. తనకేమీ సంబంధం లేదని చెప్పడంతో ముంబై కస్టమ్స్ అధికారులతో మాట్లాడాలని లేకుంటే అనేక కష్టాలు వస్తాయంటూ బెదిరించారు. వాళ్లే కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్ చేసి డాక్టర్‌తో రెండు, మూడు రోజుల పాటు మాట్లాడి మీరు ముంబై వరకు రాకుండా అన్ని ఆన్‌లైన్‌లోనే పూర్తి చేస్తామని చెప్పి మొబైల్ నంబర్ ఆధారంగా ఆధార్ అడ్రస్, ఖాతాలో ఉన్న బ్యాంకు పేర్లు చెప్పి ఏయే ఖాతాల్లో ఎంత నగదు ఉందో చెప్పారు. ఇదంతా నిజమని భావించిన డాక్టర్ అన్ని వివరాలూ చెప్పడంతో ఒక ఖాతాలోని రూ.72 లక్షల నగదు వేరే ఖాతాలో జమ చేసుకోమని సూచించారు. డాక్టర్ అదే పనిచేస్తుండగా హ్యాక్ చేసి మొత్తం స్వాహా చేశారు. దీనిపై బాధిత డాక్టర్ ఫిర్యాదు మేరకు భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రధానంగా హరియాణా, రాజస్థాన్, ముంబై నుంచి సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. దర్యాప్తు, రికవరీ చేయడం అతి కష్టంగా మారింది.

2,400 కేసుల నమోదు

గత ప్రభుత్వ హయాంలో సైబర్ నేరాల కట్టడి కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా ఒక డీఎస్పీని నోడల్ అధికారిగా నియమించి అన్ని పోలీస్ స్టేషన్లలో ఎంపిక చేసిన సిబ్బందికి ఐటీ, ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఇతర చట్టాలపై అవగాహన కల్పించేవారు. సైబర్ నేరాలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి కేసులు నమోదు చేసి ఐటీ సెల్ ద్వారా కొంత మేరకు పరిష్కార మార్గం చూపారు. 2018 నుంచి ఈ ఏడాది వరకు ఏలూరు పోలీస్ రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో 2400కు పైగా కేసులు నమోదయ్యాయి. అత్యధిక కేసులు తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లోనే నమోదవుతున్నాయి.

మూడు గంటల్లోగా ఫిర్యాదు చేయాలి



పోలీసులు, సీబీఐ, ఇన్‌కం ట్యాక్స్, ఇతర ప్రభుత్వ దర్యాప్తు విభాగాలేవీ ఫోన్‌లో వివరాలు ఎప్పుడూ తీసుకోవు. నిజంగా ఏమైనా సమస్య ఉంటే సమన్లు జారీ చేయడం గానీ, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం గానీ చేస్తారు. సైబర్ నేరగాళ్లు మాత్రమే కస్టమ్స్ అని, సీబీఐ అని చెప్పి వివరాలు అడుగుతారు. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత వివరాలు వారికి చెప్పకూడదు. సైబర్ మోసం జరిగిన మూడు గంటల వ్యవధిలో 1930 నంబర్‌కు ఫోన్ చేస్తే బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేసి బాధితులకు న్యాయం చేయగలుగుతాం.

– జీవీజీ అశోక్ కుమార్, ఏలూరు రేంజ్ ఐజీ

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: కార్తీక మాసం రెండో ఆదివారం గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలి వచ్చారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెలించుకున్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

ముసునూరు: రెండు గ్రామాల్లో పేకాట శిబిరాలపై మెరుపు దాడులు చేసి, ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. గోపవరంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి దాడిచేశారు. దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, వారి నుంచి రూ.3,400 నగదు, చింతలవల్లిలో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.1,050 స్వాధీనం చేసుకున్నారు.

మన్యంలో పెరుగుతున్న చలి



మండలంలోని బుట్టాయగూడెం మండలం అలివేరులో చలి కాగుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: జిల్లాలోని మన్యం ప్రాంతంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుంది. గత కొద్దిరోజులుగా తీవ్రమైన చలి గాలులు వీస్తున్నాయి. శీతాకాలం ప్రారంభంలోనే చలి గాలులు వీయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ప్రాంతంలో సాయంత్రం 4 గంటలకే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. అలివేరు, లంకపాకల, రేగులపాడు, రేపల్లె, గొట్టాలరేవు, చింతకొండ, ఎర్రాయిగూడెం గ్రామాలతోపాటు ముంజులూరు, గడ్డపల్లి, గిన్నేపల్లి, వీరన్నపాలెం, గోగుమిల్లి గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. 5 గంటల తర్వాత చీకటిపడే పరిస్థితి రావడంతోపాటు చలి తీవ్రంగా ఉండడంతో చలి మంటలు కాగుతూ ప్రజలు సేదతీరుతున్నారు. తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు 9 గంటల వరకూ మంచు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. ఉదయం పూట 18 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

గిరిజన ప్రాంతంలో చలి తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాస కోశ వ్యాధులతో బాధపడేవారు కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు. చలిలో బయట తిరగకూడదని చెబుతున్నారు. శీతాకాల సీజన్‌లో వృద్ధులు గుండెపోటుకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తగు జాగ్రత్తలు తీసుకోవాలి



మన్యప్రాంతంలో గత కొద్దిరోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాస కోశ సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలి. చలి నుంచి కాపాడుకోవడానికి దట్టమైన ఉన్ని దుస్తులను తప్పనిసరిగా ధరించాలి.

డాక్టర్ జి. సురేష్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ– కేఆర్‌పురం

శ్రీవారి క్షేత్రంలో పారిశుద్ధ్య లేమి

కాంట్రాక్టర్‌పై చర్యలకు వెనకాడుతున్న అధికారులు



కాలినడకన భక్తులు వస్తున్న మార్గంలో దర్శనమిస్తున్న చెత్తాచెదారం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో పారిశుద్ధ్యం రోజురోజుకి హరించుకుపోతోంది. కేశ ఖండనశాల పరిసర ప్రాంతాలతో పాటు, భక్తుల పాదయాత్ర మార్గంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తున్నారు. గతంలో క్షేత్రం పచ్చదనం, పరిశుభ్రతతో ఆహ్లాదభరితంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం అపారిశుద్ధ్యమే. భక్తులు మొక్కుబడులు తీర్చుకునే కేశఖండనశాలలోని స్నానాలు చేసే ప్రాంతంలో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. భక్తులు పాదయాత్రగా వచ్చే (కొండపైన పాత టోల్‌గేట్) మార్గం డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెత్తా, చెదారంతో ఆ ప్రాంతం నిండిపోయింది. ఆ మార్గంలోంచి వెళ్లే కాలినడక భక్తులు ముక్కుమూసుకుని క్షేత్రానికి చేరుకుంటున్నారు. కొండపైన మాధవ కల్యాణ మండపం వద్ద, కాటేజీలకు వెళ్లే మార్గంలో చెత్తకుండీలు నిండిపోయి ఆ ప్రాంతాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అపారిశుద్ధ్యం తాండవిస్తున్నా అధికారులు సంబంధిత సెవెన్‌హిల్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పారిశుద్ధ్య పనులు నిర్వహించే సంస్థ)పై చర్యలు తీసుకునేందుకు ఎందుకో వెనకాడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ సంస్థ పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ సొమ్మును స్వాహా చేయడంతో పాటు, తక్కువ మంది కార్మికులతో రెండు షిఫ్టులలో పనులు చేయించడం, ఓటీలు ఇవ్వకుండా, ఇతర సౌకర్యాలు కల్పించకుండా పనులు జరిపించడం వంటివి చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఆలయ అధికారులు ఇటీవల కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేసినప్పటికీ, పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టలేదు.

తక్కువ రేటుకు బంగారం పేరిట టోకరా



కామవరపుకోటలో మూసేసిన జ్యూయలరీ షాపు

కామవరపుకోట: బంగారు వస్తువులు తక్కువ రేటుకి ఇస్తామని నమ్మబలికి 50 మంది నుంచి సుమారు రూ.40 లక్షల వరకు వసూలు చేసి పరారైన ఘటన కామవరపుకోటలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన ఎస్.కె.నజీర్, ఎస్.కె.ఫిరోజ్ 10 ఏళ్ల క్రితం కామవరపుకోట ఇండియన్ బ్యాంకు ఎదురుగా మదీనా జ్యూయలరీ పేరుతో షాపు ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారికి బంగారు వస్తువులు తయారు చేసి తక్కువ రేటుకి ఇస్తూ వచ్చారు. వారిలో నమ్మకాన్ని కలిగించి, అదే నమ్మకంతో తక్కువ రేటుకి బంగారు ఆభరణాలు ఇస్తానని నమ్మబలికి సుమారు 50 మంది నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వరకు అడ్వాన్సుగా సుమారు రూ.40 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. రోజులు గడుస్తున్నా వస్తువులు ఇవ్వకపోవడంతో, అనుమానం వచ్చిన బాధితులు షాపు దగ్గరికి వెళ్ళగా తాళాలు వేసి, ఫోను స్విచ్ ఆఫ్ చేయటంతో మోసం పోయామని గ్రహించి స్థానిక తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.

పోలవరం కాలువ గట్టుపై ఆగని మట్టి తవ్వకాలు

మామూళ్ల మత్తే కారణమంటున్న స్థానికులు



లైన్ గోపాలపురం పరిధిలో పోలవరం కాలువ గట్టుపై గ్రావెల్ మట్టి తవ్వకాలు

ద్వారకాతిరుమల: అధికారం మనదే.. మన వెనుక ఖద్దర్ చొక్కా ఉంది.. మనల్ని ఎవడ్రా ఆపేది.. అంటూ పోలవరం కుడి కాలువ గట్టుపై గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్న తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. డబ్బు ఇచ్చి.. మట్టిని పట్టుకెళ్లండి అంటూ ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం నిద్ర నటిస్తోంది. మండలంలోని ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురం గ్రామాలకు చెందిన కొందరు తెలుగు తమ్ముళ్లు పోలవరం కాలువ గట్టును ఆదాయ వనరుగా ఎంచుకున్నారు. కాలువ గట్టుపై పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టి తవ్వకాలను జోరుగా సాగిస్తున్నారు. దీనిపై ఈనెల 9న సాక్షి దినపత్రికలో ‘పచ్చ ముఠా’ మట్టి మాఫియా శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ అక్రమార్కులు ఆ రోజు తవ్వకాలను నిలిపివేశారు. అధికార యంత్రాంగం చూసిచూడనట్టు వ్యవహరించడంతో మట్టి మాఫియా యథావిధిగా ఆదివారం మట్టి తవ్వకాలు జరిపింది. ఏలూరుకు చెందిన టిప్పర్లు పెద్ద ఎత్తున మట్టిని తరలించాయి. మామూళ్ల మత్తులో అధికారులు జోగడం వల్లే మట్టి మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. ఏలూరుకు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని ఇప్పటికే మట్టి కోసం పెద్ద మొత్తంలో నగదును సదరు పచ్చనేతలకు ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. ఇంతవరకూ ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూప్‌చంద్ రికార్డు ధర



గణపవరం: గత ఏడాది కాలంగా రైతులను నష్టాల ఊబిలో దింపిన రూప్‌చంద్ ధర ఇప్పుడు సరికొత్త రికార్డులు సృష్టిస్తుంది. కనీవినీ ఎరుగని రీతిలో కిలో ఏకంగా రూ.125 నుంచి రూ.127 వరకూ పలుకుతుంది. ఐదారు నెలల క్రితం ధరతో పోలిస్తే దాదాపు 70 నుంచి 80 శాతం ఎక్కువ. అక్కడక్కడా కొందరు రైతుల వద్ద మాత్రమే రూప్‌చంద్ చేప సాగులో ఉంది. ఇదే ధర నిలకడగా ఉంటే సాగుచేసిన రైతుల పంట పండినట్లే.

రూప్‌చంద్ ధర తెల్లచేప కన్నా కిలో రూ.10 నుంచి రూ.20 తక్కువగానే ఉంటుంది. ఈ చేప లభ్యత తగినంతగా లేకపోవడంతో దీని ధర పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం తెల్ల చేప ధర కిలో రూ.115 నుంచి రూ.120 మధ్యలో ఉండగా.. రూప్‌చంద్ మాత్రం కిలో రూ.125 నుంచి రూ.127 వరకూ పలుకుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రూప్‌చంద్ చేప తగినంతగా లేకపోవడంతో వ్యాపారులు ఈ చేప ధర గణనీయంగా పెంచేశారు.

తగ్గిన రూప్‌చంద్ సాగు

రూప్‌చంద్ చేప సాగులో ఉన్న సౌలభ్యం దృష్ట్యా ఎక్కువ మంది రైతులు ఈ రకం చేప సాగు చేసేవారు. గత రెండేళ్లుగా ఈ చేప ధర కిలో రూ.90 నుంచి రూ.105 మధ్య ఊగిసలాడుతూ ఉండేది. ఈ ధరలో రైతుకు లాభాల మాట ఎలా ఉన్నా పెట్టుబడికి ఢోకా ఉండేది కాదు. అనూహ్యంగా కొద్దినెలల నుంచి ఈ చేప ధర తిరోగమనంలో నడుస్తూ, కిలో రూ.65కు పడిపోయింది. అప్పట్లో పట్టుబడికి వచ్చిన రైతులంతా ఇదే ధరకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారు. చాలామంది రైతులు రూప్‌చంద్ సాగు వదిలేసి రొయ్యల సాగుకు మళ్లిపోయారు. దీంతో రూప్‌చంద్ సాగు గణనీయంగా పడిపోయి, చేప ధర అమాంతం పెరిగిపోయింది.

రైతులు గట్టెక్కేనా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 లక్షల ఎకరాలలో చేపల సాగు జరుగుతుండగా దాదాపు 80 వేల ఎకరాలలో రూప్‌చంద్ సాగు చేసేవారు. ఈ చేప సాగుచేసిన రైతులు నష్టాల పాలవడంతో చాలామంది సాగు వదిలేసి, రొయ్యల సాగులోకి మళ్లిపోయారు. రెండు నెలలుగా ఈ చేప ధర రూ.90 నుంచి క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.125కు చేరింది. ఈ ధర పెరుగుదల అతికొద్ది మంది రైతులకు మాత్రమే ఉపయోగపడుతుందని ఆక్వా రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రూప్‌చంద్ సాగు 20 వేల ఎకరాలలోపు మాత్రమే ఉందని పెరిగిన ధర కొద్దిమంది రైతులకు మాత్రమే లాభం చేకూరుస్తుందని చెబుతున్నారు.

రూప్‌చంద్ సీడ్‌కు గిరాకీ

రూప్‌చంద్ ధర పెరగడంతో రూప్‌చంద్ చేప పిల్ల ధర కూడా పెరిగింది. రెండేళ్లుగా రూప్‌చంద్ చేప పిల్ల కొనే నాథుడు లేక చేప పిల్లల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయారు. రెండు నుంచి నాలుగు అంగుళాల రూప్‌చంద్ పిల్ల ధర రూ.6 నుంచి రూ.3కు పడిపోయింది. చేప పిల్లల పెంపకందారులు నష్టపోయారు. ప్రస్తుతం రూప్‌చంద్ ధర పెరగడంతో పిల్ల ధర కూడా పెరిగింది.

అవసరమైన మేరకు చేప లేదు



ప్రస్తుతం మార్కెట్లో అవసరం మేరకు తగినంత రూప్‌చంద్ చేప లభించడం లేదు. దీంతో ఈ చేప ధర గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం కిలో రూ.125కు కొనుగోలు చేస్తున్నాం. గణపవరం నుంచి ప్రతి రోజూ 30 నుంచి 40 టన్నుల వరకూ రూప్‌చంద్ ఎగుమతి జరిగేది. కొంతకాలంగా పది టన్నులు మాత్రమే ఎగుమతి అవుతుంది.

కాకర్ల శ్రీనివాసరావు, ఆక్వా వ్యాపారి

రూప్‌చంద్ సీడ్ ధర బాగుంది



గత రెండేళ్లుగా రూప్‌చంద్ చేప పిల్లకు ధర లేక తీవ్రంగా నష్టపోయాం. రెండేళ్ల నుంచి ధర రూ.2 నుంచి రూ.3కు పడిపోయింది. కనీసం పెట్టుబడికూడా రాక నష్టాల పాలయ్యాం. ప్రస్తుతం చేప పిల్ల ధర రూ.6 వరకూ పెరగడంతో కొనుగోళ్లు పెరగడంతో ఊరటనిచ్చింది.

యర్రా ఆదినారాయణ, రూప్‌చంద్ చేపపిల్ల రైతు

సరకు అమ్ముకున్నాక పెరిగిన ధర



రూప్‌చంద్ ధర పెరిగినా రైతులకు ఉపయోగంలేదు. రైతులంతా కిలో రూ.80, రూ.90 ధరలోనే అమ్ముకున్నారు. ప్రస్తుతం చేప ధర రూ.125కు పెరిగినా ఎక్కువ మంది రైతుల వద్ద ఈ రకం చేప లేదు. నేను మార్చిలో 30 టన్నుల చేప కిలో రూ.85కు, జూలైలో 40 టన్నుల చేప కిలో రూ.110కి అమ్మాను.

సంకు శ్రీనివాసరావు, రూప్‌చంద్ రైతు

ఉల్లి ధర పైపైకి

- రోజురోజుకూ పెరుగుతున్న ధరలు
- సామాన్యుల బెంబేలు



గుత్త దుకాణాలలో ఉల్లి బస్తాలు



గూడెం మార్కెట్‌కు వచ్చిన ఉల్లిపాయల లారీలు

తాడేపల్లిగూడెం: ఉల్లిపాయల ధరలు ఆకాశమే హద్దు అన్నట్టుగా సీజన్‌లో కూడా ధరల మంట పుట్టిస్తున్నాయి. కర్నూలు సీజన్ ప్రారంభం నుంచే ఉల్లిపాయలు వాటి విక్రయానికి ప్రధాన మార్కెట్‌గా ఉన్న తాడేపల్లిగూడెం వస్తున్నాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో తుఫాను గండాలు వెంటాడుతాయే భయంతో కర్నూలు రైతులు ఉల్లిపాయలు తయారు కాకుండానే బయటకు తీసి మార్కెట్లకు తరలిస్తున్నారు. మరో పక్క కర్నూలు మార్కెట్ యార్డుకు తెలంగాణాలోని జోగులాంబ గద్వాల నుంచి ఉల్లిపాయలు ముంచెత్తుతున్నాయి. దీంతో కర్నూలు మొత్తం పంట గూడెం మార్కెట్‌కు వస్తుంది. రోజుకు సరాసరిన 60 రోజుల వంతున సరుకు వస్తుంది. శని, ఆది, మంగళ, బుధ వారాల్లో వందకు మించి లారీల ఉల్లిపాయలు ఇక్కడకు వస్తున్నాయి. ఆదివారం 150 లారీల సరుకు వచ్చింది. రకాల్లో నాణ్యత లేదు. రేఖలు, గోల్డా, గోల్టీ రకాలు సైతం మార్కెట్‌కు రైతులు తీసుకు వస్తున్నారు. మీడియాలు, గడువు రకాలు తక్కువగా వస్తున్నాయి. ఎండల ప్రభావం ఎక్కువగా ఉండటం, ఎండలకు ఆగే రకం కర్నూలు ఉల్లిపాయలు కావడంతో అవి కుళ్లిపోతున్నాయి. వాటిని మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు. సరుకు పెరిగినా ధర తగ్గలేదు. ఇబ్బడి ముబ్బడిగా ఉల్లిపాయలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా, నాణ్యత ఆధారంగా వ్యాపారులు ధర నిర్ణయిస్తున్నారు. కుళ్లిపోయే స్థితిలో ఉన్న ఉల్లిపాయలు గుత్తగా క్వింటాలు రూ.2000 ధర పలుకుతోంది.నాణ్యత కలిగిన ఉల్లిపాయల ధర క్వింటాలు రూ.5000 ఉంది. విడిగా నాణ్యత కలిగిన కర్నూలు ఉల్లిపాయలు విడిగా కిలో రూ.60 విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి పాత ఉల్లిపాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఆదివారం కేవలం రెండు లారీల సరుకు మాత్రమే వచ్చింది. గుత్తగా క్వింటాలు రూ.6000 పలికింది. విడిగా కిలో రూ.70 అమ్ముతున్నారు. మార్కెట్‌లో ఉల్లి ధరలు పైపైకి వెళ్లడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు 12వ పే రివిజన్ కమిటీని నియమించి వెంటనే ఇంటీరియం రిలీఫ్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీవోస్ హోంలో నిర్వహించిన ఏపీటీఎఫ్ తణుకు జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే బకాయిలు ఉన్న డీఏలు, పీఆర్సీ ఏరియర్లకు కరువు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.రామమోహన్, కె.రామప్రసాద్, ఎస్.జయరాజు, కె.అంజిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

యానాదులకు పక్కా ఇళ్లు నిర్మించాలి



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: జయంతి కాలనీలో నిరుపేదలైన యానాదులకు ప్రభుత్వం పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా జయంతి కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం కట్టించిన ఇళ్లలో అనేక దశాబ్దాలుగా యానాదులు నివాసం ఉంటున్నారన్నారు. ప్రస్తుతం ఆ ఇళ్లు కూలిపోవడం, శ్లాబులు పడటంతో చాలా మందికి గాయాలు అవుతున్నాయన్నారు. ఇళ్ల సమస్యలపై వచ్చిన ప్రతీ ప్రభుత్వానికి, అన్ని స్థాయి అధికారులకు ఎన్నో సార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేదన్నారు. తణుకు పట్టణం నడి బొడ్డున నివాసాలు ఉన్నప్పటికీ విద్య, వైద్యం, ఉపాధి వంటి వాటికి చాలా దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతలు, అధికారులు యానాదులకు ప్రభుత్వం గృహాలు కట్టించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, కొండయ్య, శ్రీను, వరలక్ష్మి, బూరయ్య, బుజ్జి, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరావు, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై వివక్షకు నిరసనగా శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు, పాస్టర్లు

తణుకు: లౌకిక దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న వివక్షతను ఖండిస్తూ, క్రైస్తవుల ఐక్యతను చాటుతూ వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు ఆదివారం తణుకులో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. తణుకు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రైస్తవ ఉజ్జీవ సభలను అడ్డుకున్నందుకుగాను క్రైస్తవులు తమకు జరిగిన అవమానంగా భావించి ఆదివారం చేపట్టిన ర్యాలీ తణుకు మున్సిపల్ కార్యాలయం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు సాగింది. ఈ నెల 9, 10, 11 తేదీల్లో తణుకు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉజ్జీవ సభలు నిర్వహించుకునేందుకు పోలీసు, రెవెన్యూ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సభ ప్రారంభానికి ముందు హైస్కూలు ఆవరణలో అనుమతులు లేవంటూ గేటుకు తాళం వేసి అందరినీ బయటకు పంపించి వేశారు. నవంబర్, డిసెంబరు నెలల్లో మాత్రమే అనుమతులు లేవని అధికారులు చెప్పడంతోపాటు శనివారం సాయంత్రం జరిగే సభను అడ్డుకోవడం తమపై వివక్ష చూపడమేనంటూ క్రైస్తవులు ధ్వజమెత్తారు. చట్టాలు, కోర్టు ఆర్డర్లు, ఎన్నికల కోడ్ అంటూ అధికారులు సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా కార్యదర్శి జొహన్నాస్ ప్రేమ్‌కుమార్, ఎస్సీసీ రాష్ట్ర కార్యదర్శి ఒ.మనోజ్‌బాబ్, యూసీఏ కార్యదర్శి కె.బ్లెస్సింగ్‌రాజు, టియుపీఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎం.హారెత్‌బాబు, పెరవలి, ఉండ్రాజవరం, ఇరగవరం, అత్తిలి మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శులు ఊబా రాజు, షారోన్‌రాజు, ఆగమనరావు, శేఖర్, బి.శ్రీనివాస్, ఉందుర్తి రాజ్‌కుమార్, అబ్బదాసరి లాజర్, మురాల సుధాకర్, జగ్జీవన్ ఆధ్వర్యం వహించిన ఈ కార్యక్రమంలో తణుకు, ఇరగవరం, పెరవలి, ఉండ్రాజవరం, అత్తిలి మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 3 శాతం



పాల్గొన్న బాస్కెట్ బాల్ క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్పోర్ట్స్ కోటా ద్వారా క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ పెంచారని, సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని బాస్కెట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోడే వెంకట్రావు మున్సిపల్ స్కూల్‌లో బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 టీంలు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానం తాడేపల్లిగూడెం, రెండో స్థానం దేవరపల్లి మండలం రామన్నపాలేనికి చెందిన టీంలు విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో తాడేపల్లిగూడెం, రెండో స్థానం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజేతలుగా నిలిచారు. విజేతలకు చిట్యాల పద్మిని, బొలిశెట్టి రాజేష్ బహుమతులు అందజేశారు. పోటీలను పీడీ చింతకాయల సత్యనారాయణ, అశిష్ రాజు, రాజేష్ పర్యవేక్షించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఇళ్ల బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కళింగ లక్ష్మణరావు

పెంటపాడు: అర్హులైన ప్రతీ పేదవాడికీ తక్షణం కూటమి ప్రభుత్వం ఇళ్లు అందించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా పెంటపాడులో ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేని బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కళింగ మాట్లాడుతూ ఈ నెల 18న ఇళ్ల స్థలాల కోసం భారీ సంఖ్యలో బాధితులు మండల కార్యాలయం వద్ద అర్జీలు సమర్పిస్తారన్నారు.పెంటపాడులో ఇళ్లు లేని బాధితులు ఎంతో మంది ఉన్నారన్నారు. ప్రతీ గ్రామంలో బాధితులను ప్రభుత్వం గుర్తించి వారికి తక్షణం ఇళ్లు అందించే కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బందితో పాటు, ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొణతాల నాగరాజు, నల్లమిల్లి ఫణి, బీసీ కాలనీవాసులు పాల్గొన్నారు.


నేటి నుంచి పాండురంగ స్వామి కల్యాణోత్సవాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన పాండురంగ స్వామి ఆలయం

తణుకు టౌన్: కార్తీక మాసంలో శివాలయాల్లో శివ పార్వతులకు పూజలు చేయడం మామూలే కానీ వేల్పూరు గ్రామంలో కార్తీక పౌర్ణమి నాడు పాండు రంగ స్వామి కల్యాణ వేడుకలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. గత 75 సంవత్సరాలుగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమికి ఐదు రోజులు ముందు నుంచి పాండు రంగ స్వామి ఆలయం వద్ద ఉత్సవాలు చేయడం సాంప్రదాయంగా వస్తుంది. కార్తీక మాసంలో మహారాష్ట్ర రాష్ట్రంలోని పండరీపురంలో పాండురంగ స్వామి ఆలయం వద్ద కల్యాణం చేసి ఉత్సవాలు చేస్తారు. అదే మాదిరిగా వేల్పూరులోని పాండురంగ స్వామి ఆలయం వద్ద కూడా ఐదు రోజులు పాటు హోమాలు నిర్వహించడం సంప్రదాయంగా గత 75 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం దశమి రోజున స్వామివారికి చలివిడి, పానకాలు పంపిణీ చేయడం, ఏకాదశి రోజున పాండు రంగ స్వామి, రుక్మిణి కల్యాణం ద్వాదశి రోజు లక్ష దీపార్చన, పౌర్ణమి రోజు ఉదయం భారీ అన్న సమారాధన, సాయంత్రం భారీ భాణా సంచా కాలుస్తూ హోమ గుండంలో ఉత్సవాలు ముగుస్తాయి. కల్యాణం సందర్భంగా భారీ అన్న సమారాధనలో సుమారు 15 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కల్యాణోత్సవాలు ఐదు రోజులు పాటు గ్రామంలో ఉత్సవాల వాతావరణ సందడి చేస్తూ ఉంటుందని, ఇది గత 75 ఏళ్లుగా వస్తున్న సంప్రదాయంగా గ్రామస్తులు నిర్వహిస్తున్నారు.

హక్కుల సాధన ఉద్యమంగా రాజ్యాంగ దినోత్సవం




సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

తణుకు: నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని తణుకులో కార్మిక సంఘాలు, పౌర సంఘాలు, వివిధ తరగతుల ప్రజా సంఘాల ఐక్య ఉద్యమంగా నిర్వహించడానికి నిర్ణయించినట్లు రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డీవీవీఎస్ వర్మ అన్నారు. ఆదివారం స్థానిక సురాజ్య భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన వర్మ మాట్లాడుతూ మన ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, మన పన్నుల సొమ్ముతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయని, భారత రాజ్యాంగం ప్రజలనే యజమానులను చేసిందన్నారు. ఈ సన్నాహక సమావేశంలో పీవీ ప్రతాప్ (సీఐటీయూ), దేవ పెద్దిరాజు (ఏఐటీయూసీ), పేరూరి మురళీ కుమార్, గొల్లపల్లి అంబేద్కర్ (సామాజిక న్యాయ పోరాట సమితి), నీలం మాల్యాద్రి (సమతా ఎడ్యుకేషన్ సొసైటీ), డాక్టర్ రమేష్ చంద్రబాబు (తణుకు స్టడీ సర్కిల్), కామన మునిస్వామి (ఇండియన్ లాయర్స్ యూనియన్), కౌరు వెంకటేశ్వర్లు (పౌరహక్కుల సంఘం), సంకు మనోరమ (రాజ్యాంగ పరిరక్షణ సమితి), జి.కరుణాకర చౌదరి టి.అప్పలస్వామి (ఏఐఎస్ఎఫ్), కట్టా గోపాలకృష్ణ (బీసీ సంఘం), టి.పాండురంగారావు (టైలర్స్ సంఘం), ఎ.శ్రీనివాస్ (నాయీ బ్రాహ్మణ సంఘం), జి.హనుమంతరావు (సైకిల్ వర్కర్స్ యూనియన్), జి.శ్రీనివాసరావు (విశ్వ బ్రాహ్మణ సంఘం), తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

తణుకు టౌన్: ఎన్నికల్లో ప్రజలకు టీడీపీ జనసేన, బీజేపీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో ప్రజా పోరు పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల నుంచి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక, మద్యం మాఫియాలు విచ్చల విడిగా రెచ్చిపోతున్నాయన్నారు. వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం బెల్ట్ షాపులు తెర తీసినట్లైందన్నారు. వీటికి వ్యతిరేకంగా ఈ నెల 14న మండల కేంద్రాల్లో, 15న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, అంబటి రామకృష్ణ, కె.వీరభద్రరావు, వి.పోసియ్య, అల్లం శ్యామ్, టి.సత్యనారాయణ, బి.మోహనరావు, వి.సుబ్బారావు, అర్జున్, ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కృషి



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న ఏఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఆకుల విజయవర్ధన్

తణుకు టౌన్: విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించే జాతీయ శిబిరాలు దోహదం చేస్తాయని ఏఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఆకుల విజయవర్ధన్ చెప్పారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని స్టెప్పింగ్ స్టోన్స్ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొని స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాణించిన విద్యార్థులు జీవన శైలిలో మంచి మార్పులను సాధిస్తారని చెప్పారు. అడ్వెంచర్ శిబిరాలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు ఐక్యతా భావం, స్నేహ సంబంధాలు ఏర్పడతాయని చెప్పారు. ఈ శిబిరంలో పాల్గొన్న వివిధ ప్రాంతాల విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ప్రసంశా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ ఆర్గనైజింగ్ కమీషనర్ కిషోర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన అడ్వంచర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శించిన సాహస కృత్యాల గురించి వివరించారు. కార్యక్రమాల్లో ఏఎస్ఆర్ విద్యా సంస్థల సీఈవో కే రాజశేకర్, స్టేట్ చైర్మన్ రావి ముత్యాలరాజు, స్టేట్ చీఫ్ కమిషనర్ రామ గంగాధర్, స్టేట్ కార్యదర్శి ఏవీఆర్ నరేష్ బాబు, కర్ణాటక, కేరళలకు చెందిన నిర్వాహకులు ఎస్.శ్రీధరన్, ఎం.దీపిక, బిందేలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామికి కలశ పూజ

తణుకు అర్బన్: స్వామియే అయ్యప్ప అయ్యప్ప అంటూ మాలధారుల భక్తి నినాదాలతో తణుకు ప్రాంతం హోరెత్తింది. అయ్యప్పస్వామి మాలధారులు కలశాలతో నిర్వహించిన గ్రామోత్సవం భక్తులను అలరించింది. తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి వేమూరి చలపతి ఆధ్వర్యాన ఆదివారం ఉదయం నుంచి కలశ పూజ నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అనంతరం విశేష అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో అయ్యప్ప మాలధారుల సమక్షంలో 108 కలశాలతో కలశ పూజ నిర్వహించారు. ఈ ఏడాది మాల ధరించిన 108 మంది కన్నె స్వాములతో ఈ పూజా కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి కలశాలతో మాలధారులు ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా సొసైటీ రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, నరేంద్ర సెంటర్, మున్సిపల్ కార్యాలయం, వేల్పూరు రోడ్డు, స్త్రీసమాజం రోడ్డు, బొమ్మల వీధి మీదుగా సజ్జాపురం శివాలయానికి చేరుకుని మాలధారులు గోస్తనీ కాలువలో స్నానమాచరించి తిరిగి ఆలయానికి చేరుకుని పూజాధికాల్లో పాల్గొన్నారు. మాలధారులు, భక్తులు ఈ పూజా కార్యక్రమాలను తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంచార వైద్యశాలలో వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్య సేవల కార్యక్రమంలో 7 గురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్యల ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు, మండపాక తదితర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని 7 గురు వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు అక్కిన కాశీవిశ్వనాథం ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్, ఫిజిక్ మోడలింగ్ పోటీలు ఆదివారం రాత్రి బీవీఆర్ కళా కేంద్రంలో నిర్వహించారు. సిక్స్ ప్యాక్‌తో వివిధ బాడీ బిల్డింగ్ భంగిమలను ప్రదర్శించారు. ఆర్గనైజేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిల్లలు, వృద్ధులు సంతోషంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సభ్యులు, పిల్లలు, వృద్ధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పిల్లలు, వృద్ధులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వాభిమాన్ ట్రిబుల్ ఎఫ్ విద్యార్థులతో కలిసి జీవన సంధ్యా వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు, వివిధ సేవలు ఘనంగా నిర్వహించినట్లు ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ, ఆర్గనైజేషన్ ట్రస్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నా జనార్ధన్‌రావు ఆదివారం వెల్లడించారు. స్వాభిమాన్ పిల్లలను తీసుకొచ్చి వృద్ధులతో సంతోషంగా గడపటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు కేశవ్, బ్రహ్మజీ, ఆనంద రావు, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పేరిచర్ల ఫౌండేషన్ డైరెక్టర్ వీరభద్రరాజు ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. యర్రా ఆంజనేయస్వామి, ఆకుల సతీష్, మధుబాబు, బడుగు చంద్రశేఖర్, వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక వన సమారాధన



కార్తీక వన సమారాధన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో పులమోలు వారి కార్తీక వన సమారాధన ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ×పులమోలు¤ వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ సరదా సరదాగా గడిపారు. పులమోలు రాముడు (కర్ణాటక), పులమోలు వెంకటేశ్వరరావు, సర్వేశ్వరరావు, త్రినాథ్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

జగన్నాథపురంలో ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఆదివారం రాత్రి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన నాగశ్రావణి ఏప్రియల్ 28వ తేదిన హత్యకు గురైన సంఘటన తెలిసిందే. అప్పట్లో మృతురాలి పిల్లలకు ఆస్తిలో వాటాపై ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తుల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఆ ఒప్పందం విషయంపై మృతురాలి తల్లిదండ్రులు ఆరు నెలలుగా జగన్నాథపురంలోని నిందితుల ఇంటి చుట్టూ తిరుగుతున్నా స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు. ఆదివారం రాత్రి గ్రామంలోని రహదారిని గ్రామస్తుల సహకారంతో దిగ్బంధించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై జేఎస్వీ.ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఒకానొక సందర్భంలో గ్రామస్తులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రామంలో పోలీసు పహారా నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్ర దర్శనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం పురస్కరించుకుని పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్ర దర్శనానికి యాత్రికులు ఆదివారం రాత్రి సూపర్ లగ్జరీ వీడియో కోచ్ ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలోని పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వెళుతున్నట్లు చెప్పారు. సోమవారం పట్టణానికి యాత్రికులు తిరిగి వస్తారని వెల్లడించారు. ఇతర యాత్రలు కూడా అందుబాటులో ఉన్నట్లు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కవి ప్రసాద్‌కు పురస్కారం

తణుకు: ఆది కవి నన్నయ విశ్వ విద్యాలయం, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న రాజమండ్రిలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ పురస్కారం అందుకున్నారు.